క్లుప్తంగా

'హాథ్ సే హాథ్ జోడో' విజయవంతం చేయాలి



రాజంపేట: మండల కేంద్రంలో ఈ నెల 18న చేపట్టబోయే హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దత్తున హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజంపేటలో మండల అధ్యక్షులు యాదవరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పీసీసీ కన్వీనర్ షబ్బీర్ అలీలు పాల్గొననున్నట్లు తెలిపారు.

పశువైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లిలో ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్లు చైర్మన్ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, పశువైద్యాధికారి రవి కుమార్, డైరెక్టర్ సత్యవతి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, గోపాలమిత్ర ఎజాజ్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

బాన్సువాడ టౌన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన మహిళలకు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు ఎజాస్ ఉన్నారు.

'పైలాన్' పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): నాగమడుగు ఎత్తిపోతల శంకుస్థాపన పైలాన్ పనులను మంగళవారం ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు పరిశీలించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, కాశయ్య, తదితరులు ఉన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్ పనులు..

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు పనులను జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ నల్లవు శ్రీనివాస్ ఉన్నారు.

సైన్స్ ప్రయోగశాల మారథాన్ ప్రారంభం

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాల మారథాన్‌ను జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి సైన్స్ ప్రయోగాల పట్ల ఆసక్తిని పెంపొందించేకునేందుకు ఈ మారథాన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ ఉపాధ్యాయులు, వెంకన్న ,దత్తు, మాధవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

బాన్సువాడ రూరల్: దేశాయిపేట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి తనిఖీచేశారు. చిన్నారుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వడ్డించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. రికార్డు నిర్వాహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవి, నాయకులు వెంకట్రాంరెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత రూ.లక్ష విరాళం

మాచారెడ్డి: సర్దాపూర్ తండాలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబ ఆలయానికి బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకటరెడ్డి ఆ పార్టీ నేత వెంకటరమణారెడ్డి తరఫున తండావాసులకు డబ్బులను అందజేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నర్సింహాచారి, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా మండల బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్ మాట్లాడుతూ..జిల్లాకు ఏ టీఆర్ఎస్ మంత్రి వచ్చి నా ఇలా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. తాము చేస్తున్న పాలన గాడి తప్పిందని బీఆర్ఎస్ పాలకులకు తెలుసు కనుకనే ముందస్తు అరెస్టులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. మైనారిటీ మోర్చ మండల అధ్యక్షులు సమీర్, ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు టేకుర్ల శేఖర్ ఉన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీ

దోమకొండ: అంచనూరులో మంగళవారం వరిలో పురుగు మందులను డ్రోన్‌తో పిచికారీ చేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు డ్రోన్‌పై అవగాహన కల్పించారు. ఐకేపీ సీసీ శర్పని రాజేశం, ఫౌండేషన్ ప్రతినిధులు సతీష్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

ప్రాణాలు అరచేతిలో పట్టుకొని..

- జిక్కు జిక్కుమంటూ పశువులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- సొంత భవనం స్థలంలో గ్రంథాలయం నిర్మాణం
- పాత గ్రామ పంచాయతీలో కాలం వెల్లదీస్తున్న వైనం
- బీబీపేట మండలంలో పశువైద్య సేవలకు ఆటంకం



శిథిలావస్థలో ఉన్న జీపీలో ఏర్పాటు చేసిన బీబీపేట పశువైద్యశాల





గదిలో ఇనుప చువ్వలు తేలి ఊడుతున్న పైపెచ్చులు .. మందుల గది లోపలి పరిస్థితి..

బీబీపేట: మండలంలోని పశువైద్యశాలకు పక్కా భవనం లేకపోవడంతో సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సేవలు అందిస్తున్నారు. పాత భవనం స్థలంలో నూతన గ్రంథాలయం భవనాన్ని నిర్మించడంతో పశువైద్యశాలను పాత గ్రామ పంచాయతీ భవనానికి మూడేళ్ల కిందట తరలించారు. దీంతో అప్పటికే శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పాత గ్రామ పంచాయతీ భవనం ఉండటంతో సిబ్బంది బయట కూర్చొనే సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. మందులు, వైద్య సామాగ్రి ఎక్కడ ఉంచాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఈ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి దాపురించింది. ఈ ఆస్పత్రి పైకప్పు పూర్తిగా ఇనుప చువ్వలు తేలి వేలాడుతున్నాయి. అందులో మందులు, వైద్యపరికరాలు భద్రపరచడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రికి తీసుకువచ్చిన పశువులకు ఉంచడానికి నీడ, తాగడానికి నీరు సైతం లేదు.

మహిళా సిబ్బందికి అవస్థలు..

పశువైద్యశాలలో పని చేస్తున్న మహిళా సిబ్బంది ఒంటికి, రెంటికీ పోవాలంటే ఇబ్బంది పడాల్సిందే. కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. బీబీపేట పశువైద్యశాల సొంత భవనం నిర్మాణం కోసం ఏడేళ్ల క్రితం పంచాయతీ పాలకులు వారాంతపు సంత వద్ద 500 గజాల స్థలం కేటాయించారు. ఆ స్థలంపై పాలకులు తీర్మానం కూడా చేశారు. కానీ ప్రభుత్వం తరఫున నిర్మాణానికి నిధులు కేటాయించడం లేదు. ఇప్పటికైనా అధికారులు దీనిపైన దృష్టి సారించి నిధులు మంజూరయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పటికీ 50ఏళ్ల నాటి భవనంలోనే

మండల కేంద్రంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన పాత గ్రామ పంచాయతీ భవనంలోనే పశువైద్యశాల కొనసాగుతుంది. ఈ పశువైద్యశాలకి చుట్టుపక్కల 11 గ్రామాల రైతులు సేవల కోసం వచ్చి వెళ్తుంటారు. వచ్చిన వారు సైతం ఆ భవనంలోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. మందులు, ఇతర వస్తువులు వర్షపు నీటికి తడిసి పనికి రాకుండా పోతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితిలో పశువైద్య సేవలు ఇందులో కొనసాగించాల్సి వస్తోంది. వర్షాకాలంలో గోడలు అన్నీ వర్షానికి తడిసి వాటి వెంట ఉన్న వైర్ల ద్వారా కరెంటు షాక్ కూడా వస్తుందని వాపోయారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని గతంలో కూడా చాలా సార్లు నివేదికలు అందించాం. ఇక్కడ విధులు నిర్వర్తించడమంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఎప్పుడు ఎటు పక్క నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది.

– హేమశ్రీ, పశువైద్యులు, బీబీపేట

అంగన్‌వాడి నిర్వహణ సరిగా లేదు



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ కవిత

పిట్లం(జుక్కల్): తిమ్మనగర్ గ్రామ అంగన్వాడీ సెంటర్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం లేదని, అంగన్‌వాడీ టీచర్ సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదులు వచ్చాయని అంగన్‌వాడీ సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చర్యలు చేపట్టాలని, గుడ్లు, పౌష్టికాహారం అందేలా చూడాలని ఎంపీపీ కవిత అంగన్‌వాడి అధికారిణులకు సూచించారు. మండల పరిషత్ కార్యలయంలో మంగళవారం ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులతో శాఖల వారీగా అజెండా అంశాలపై సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దేవుడి అనుగ్రహంతో దైవకార్యాలు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

నిజాంసాగర్(జుక్కల్): దేవుడి అనుగ్రహంతో దైవ కార్యాలు సాధ్యమవుతాయని, దైవ భక్తిలో ప్రతీ ఒక్కరు ముందుండాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్‌లో రేణుకా ఎల్లమ్మ పదవ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గౌడ కులస్తులు పండుగలా జరుపడం సంతోషకంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు ప్రజాప్రతినిధులను సన్మానించారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, విఠల్, నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి అపర్ణ

భిక్కనూరు: రానున్న ఐదు రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అపర్ణ అన్నారు. మంగళవారం భిక్కనూరు మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న ఐదు రోజుల్లో ఈదురుగాలులతో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో వర్షం కురిసే అవకాశం ఉందని, రైతులు అందరూ జాగ్రత్తలు తీసుకుని ఈ రోజుల్లో ఎరువులు, పురుగు మందులు వాడవద్దని సూచించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, పశు వైద్య శిబిరాలను నాలుగు మండలాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలని తీర్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి థామస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి

- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న టీఎన్జీవోస్ నేతలు

కామారెడ్డి క్రైం: ఉద్యోగులు అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలను పొందాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం టీఎన్జీవోస్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ జిల్లా ఫోరం క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉద్యోగులు ఐక్యంగా ఉంటే తమ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవచ్చన్నారు. టీఎన్జీవోస్ కార్యదర్శి సాయిలు, మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ జిల్లా ఫోరం అధ్యక్షుడు వెంకటి, కార్యదర్శి పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అన్నివేళలా వైద్యం అందించాలి

మద్నూర్(జుక్కల్): వైద్యులు, రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష పేర్కొన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీలో మంగళవారం మహిళ ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. వైద్యులు రీతు పటేల్ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

కోడిచిర ఆరోగ్య సబ్‌సెంటర్‌లో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివలీల మాట్లాడుతూ.. క్షయలో రెండు రకాలు ఉంటాయని, వ్యాధిని గుర్తించి 6 నెలలు, 12 నెలలు మందులు వాడితే తగ్గిపోతుందని తెలిపారు.

వైభవంగా శీతల్ ఉత్సవ్



మద్నూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్వాడీ మహిళలు రాజస్తాన్ సాంప్రదాయం ప్రకారం శీతల్ ఉత్సవ్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పోచమ్మ గుడిలో పిల్లపాపలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ సందర్భంగా ఒకరోజు ముందు వండిన చల్లటి వంటకాలను పోచమ్మకు నైవేద్యంగా సమర్పించారు. హోళీ పండగ అనంతరం వారం రోజుల తర్వాత ప్రతి సంవత్సరం శీతల్ ఉత్సవ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు.

ఘనంగా గురుపూజోత్సవం



భిక్కనూరులో పూజలో పాల్గొన్న భక్తులు

భిక్కనూరు: మండల కేంద్రంలో వరకవి యోగి సిద్ధప్ప రాజయోగి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా హోలీ పండుగ అనంతరం వచ్చే బహుళ సప్తమి రోజున రాజయోగి గురుపూజోత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సిద్ధప్ప రాజయోగి కుమారుడు అనంతవరం వీరేశలింగం ఆధ్వర్యంలో సరస్వతి పూజ, సిద్ధంప్ప పూజను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భక్తులు భారీగా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



బీబీపేట: ఇస్సానగర్ గ్రామానికి చెందిన 50 మంది బీజేపీ కార్యకర్తలు మంగళవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి పార్టీలో చేరినట్లుగా వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, తదితరులున్నారు.

విమాన రథోత్సవం

భిక్కనూరు: సిద్దరామేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి వారి విమాన రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ పీఠాధిపతి సదాశివ మహంత్ భాజభజంత్రీలతో ఆలయం నుంచి మండల కేంద్రంలో ఉన్న సిద్దగిరి సమాధి వద్దకు వచ్చి అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం సదాశివ మహంత్ రుద్రకారుడై ఆలయం వరకు పరుగెత్తారు. పలువురు భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి

- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనర్సింలు



మాట్లాడుతున్న సిరిగాద లక్ష్మీ నర్సింలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పద్మశాలీలందరూ ఏకతాటిపైకి వచ్చి సంఘటితం కావాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీ నర్సింలు సూచించారు. మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో మంగళవారం పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐక్యంగా ఉండాలన్నారు. జెండాలన్నీ పక్కన పెట్టి ఎజెండాయే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పద్మశాలీల సమస్యలపై పోరాడేందుకు ఎళ్లవేళలా ముందుంటానని అన్నారు. కమిటీలలో స్థానం పొందిన సభ్యులు క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం కమి టీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణహరి, భూమేష్, కోశాధికారి ధర్మపురి, ప్రచార కార్యదర్శి వెంకట నారాయణ, ఎల్లారెడ్డి డివిజ న్ అధ్యక్షుడు పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్/పెద్దకొడప్‌గల్/బాన్సువాడ రూరల్/రామారెడి: గురుకుల పాఠశాలల్లో 2023–24 ఏడాదికి 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి కృష్ణమూర్తి, పెద్దకొడప్‌గల్, బోర్లం, రామారెడ్డి గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు నళిని, పద్మకుమారి, సత్యనారాయణలు వేర్వేరుగా తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, మార్చి 16లోగా రూ.100 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న నిర్వహిస్తారని వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భరోసా



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 88 మందికి మంజూరైన రూ.31.38 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్న మరో నలుగురికి ఎల్‌వోసీలను ఆయన నివాసం వద్ద మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, అధికార ప్రతినిధి బల్వంత్‌రావు పాల్గొన్నారు.

క్షయ సోకితే భయపడొద్దు



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న విజయ్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్షయ వ్యాధి వచ్చిన వారు భయపడవద్దని ఎల్లారెడ్డి టీబీ యూనిట్ పర్యవేక్షకుడు విజయ్ అన్నారు. ఎర్రాపహాడ్ పీహెచ్‌సీలో టీబీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ ఒక్కరు క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరికైన వారం పాటు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, తెమడలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఉచితంగా మందులు, ప్రతి నెలా రూ.500 చొప్పున వారి ఖాతాలో జమ చేస్తామన్నారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి



రసీదు అందజేస్తున్న డీపీవో శ్రీనివాస్ రావు

పిట్లం(జుక్కల్): జిల్లాలో ప్రజలందరూ సకాలంలో పంచాయతీలకు పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని డీపీవో శ్రీనివాస్ రావు కోరారు. ఆయన మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పిట్లం పంచాయతీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో తిరిగి పన్నులు వసూలు చేశారు.డీఎల్‌పీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరాలు ప్రారంభం



మద్దెలచెరువు జీపీలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు ప్రారంభించారు. సర్పంచ్ సాయిరెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ్ గౌడ్, ఎంపీటీసీ స్వరూప, రైతు బంధు మండలాధ్యక్షుడు భూంరెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బోనాల సుభాష్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నం, ఉపసర్పంచ్ షేక్ అక్బర్, నాయకులు బోనాల సాయిలు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): మద్దెలచెరువు గ్రామపంచాయితీ కార్యాలయంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ పండిత్‌రావ్ ప్రారంభించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి అజ్మీర, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మాచారెడ్డి గ్రామ సర్పంచ్ లలిత, ఎంపీటీసీ సభ్యురాలు వినోదలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాంచంద్రం, నాయకులు నారాయణ, ప్రభాకర్, కంటి వెలుగు సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

సంక్షిప్తం

సర్పంచ్ మృతి..స్పీకర్ నివాళి

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామ సర్పంచ్ పసుపుల లక్ష్మి అనారోగ్యంలో సోమవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ ఉన్నారు.

40వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గాంధాని శ్రీనివాస్, కామారెడ్డి సందర్శన సందర్భంగా కామారెడ్డి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పార్శి కాంశెట్టి 40వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రముఖులు వీటీ రాజ్ కుమార్, ఎం.రాజన్న, పీపీ నర్సింహం పాల్గొన్నారు.

గ్రూప్–4 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

బీబీపేట: మాందాపూర్‌లో గ్రూప్–4 ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, చంచల్‌గూడ జైలు ఎస్పీ నవాబ్ శివకుమార్ సహకారంతో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను మండల ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్, సర్పంచ్ రేవతిలు పంపిణీ అందజేశారు. అభ్యర్థులు కష్టపడి ఉద్యోగం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లిలో మంగళవారం సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ పద్మ ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. గంగారెడ్డి, అట్టెం శ్రీను పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): నేడు పిట్లంలో జరుగబోయే కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు విజయ్ దేశాయ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సు పాసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల దివ్యాంగులకు బస్సు పాసులు ఇవ్వనున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి డీఎం సూచన మేరకు మార్చి 14 నుంచి లింగంపేట గ్రామ పంచాయతీలో దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉత్తునూర్ సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్ రావు సూచించారు. మంగళవారం ఉత్తనూర్, వజ్జపల్లి, భూంపల్లి గ్రామాల్లోని టెన్త్ విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.

చెక్కుల పంపిణీ

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ తిరుమల దేవస్థానం వద్ద నస్రుల్లాబాద్ మండల లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీపీ విఠల్, మండల పార్టీ అధ్యక్షులు పెర్క శ్రీనివాస్, తహసీల్దార్ బావయ్య ఉన్నారు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. నాయకులు నీలుపటేల్, దాదారావ్, శివానంద్, ఉన్నారు.